సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



ఆదాయం రూ.5.13లక్షలు

సిరిసిల్లటౌన్: శ్రీలక్ష్మీవేంకటేశ్వర, శివసాయి బాబా, పాతపోచమ్మ, విశ్వనాథ ఆలయాల్లోని హుండీల ద్వారా రూ.5.13 లక్షలు వచ్చినట్లు ఈవో మారుతీరావు తెలిపారు.

సెల్ఫీ విత్ మట్టిగణేశుడు

పర్యావరణాన్ని కాపాడేలా మట్టిగణేశుడిని ప్రతిష్ఠించారా.. ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ లేదా ఇళ్లలో మట్టి గణపతులను పూజిస్తున్నారా.. అయితే మీరు పర్యావరణహిత గణేశుడితో సెల్ఫీఫొటో తీసుకుని సెల్ నంబరు 98488 64042 కు వాట్సప్ చేయండి. మీరు పంపిన ఫొటోను 'సాక్షి' దిన పత్రికలో ప్రచురిస్తాం



న్యూస్‌రీల్

అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): అన్నివర్గాల అభ్యున్నతే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. గంభీరావుపేటలోని శాలివాహన, స్వర్ణకార, అంబేడ్కర్ కులసంఘాల భవన నిర్మాణం, దోసలగూడెంలో డ్రెయినేజీ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. రవీందర్‌రావు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఎవరెన్ని చెప్పినా ప్రజలకు కేసీఆర్‌పై విశ్వాసం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, సెస్ మండల డైరెక్టర్ గొరినేని నారాయణరావు, వైస్‌ఎంపీపీ దోసల లత, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అహ్మద్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ లింగం యాదవ్, బీఆర్‌ఎస్ మండల, పట్టణశాఖ అధ్యక్షులు వెంకటస్వామిగౌడ్, వెంకటియాదవ్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



గుడి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడ: వేములవాడలో ఈనెల 27న నిర్వహించే గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ నాగేంద్రచారి సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్, ఆలయ అధికారులతో కలిసి బుధవారం గుడిచెరువు వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా గుడిచెరువులో నిమజ్జనం చేయాలన్నారు. గుడిచెరువు వద్ద గజఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రాత్రి 12 గంటల్లోపు నిమజ్జనం పూర్తి చేయాలని కోరారు. ఏఈలు నర్సింహస్వామి, నర్మద, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విలాసాగర్ పీహెచ్‌సీలో ఎన్‌క్వాస్ బృందం



ఆస్పత్రిలో పరిశీలిస్తున్న ఎన్‌క్వాస్ బృందం సభ్యులు డాక్టర్ సుమన్ వశిష్ట్, అజయ్‌శర్మ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని విలాసాగర్ పీహెచ్‌సీని బుధవారం ఎన్‌క్వాస్ బృందం సభ్యులు డాక్టర్ సుమన్ వశిష్ట్, డాక్టర్ అజయ్‌శర్మ సందర్శించారు. ఆరు విభాగాల్లో 8 అంశాలపై చర్చించారు. పీహెచ్‌సీ పరిసరాలు, ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఇమ్యూనైజేషన్, మందుల వివరాలు, లేబర్ ల్యాబ్ ఇతర రికార్డులు పరిశీలించారు. జిల్లా ఎన్‌క్వాస్ మేనేజర్ విద్యాసాగర్, డీపీవో ఉమ, ఎంపీపీ పి.వేణుగోపాల్, పీహెచ్‌సీ వైద్యాధికారి అనిత, సూపర్‌వైజర్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఉన్నారు.

బిల్లులు చెల్లించకపోతే సరఫరా నిలిపివేస్తాం



వినతిపత్రం ఇస్తున్న క్యాటరింగ్ కాంట్రాక్టర్స్

సిరిసిల్లఅర్బన్: గురుకుల పాఠశాలకు సంబంధించి క్యాటరింగ్ బిల్లులు చెల్లించకపోతే సరకుల సరఫరా నిలిపివేస్తామని చిన్నబోనాలలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌లో జిల్లా క్యాటరింగ్, కాంట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నోటీస్ అందజేశారు. వారు మాట్లాడుతూ నాలుగు నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో గ్యాస్, సరుకులు, కార్మికుల జీతాల కోసం అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నాయకులు మల్లేశం, దేవరాజు, శంకర్, సందీప్ ఉన్నారు.

జలుబు.. దగ్గు..జ్వరం

- ప్రబలుతున్న విషజ్వరాలు
- సీజనల్ వ్యాధులతో గ్రామీణుల ఇబ్బంది
- జిల్లా ఆస్పత్రికి పోటెత్తుతున్న రోగులు
- తగ్గని టైపాయిడ్, డయేరియా
- రోజులకొద్దీ ఆస్పత్రిలోనే..
- నిత్యం 700 మందికి పైగా అవుట్‌పేషంట్లు

మంచంపట్టిన పల్లెలు



సిరిసిల్ల ఆస్పత్రిలో రోగులు



వేములవాడ ఏరియా ఆస్పత్రిలో ఓపీ కోసం బారులు

సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్: జిల్లాలో ఇంటికొకరు జ్వరపీడితులు ఉన్నారు. డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో జ్వరాలతో జనాలు ఆస్పత్రి బాట పట్టారు. నిత్యం సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. గత పదిహేను రోజులుగా ఆస్పత్రికి వస్తున్న వారిలో అత్యధికంగా జ్వరబాధితులే ఉన్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో విజృంభిస్తున్న జ్వరాలపై గ్రౌండ్ రిపోర్టు.



బెడ్‌పై పడుకొని ఉన్న ఈ చిన్నారి సిరిసిల్లకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ప్రగతి. ఐదు రోజుల క్రితం ఎప్పటి లాగే స్కూల్‌కు వెళ్లింది. ఒక్కసారిగా జ్వరం వచ్చి బడిలోనే కళ్లు తిరుగుతున్నాయంటూ పడిపోయింది. పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు అప్రమత్తమై జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. జ్వరంతోపాటు కడుపునొప్పి, డయేరియా, జలుబు, దగ్గు లక్షణాలున్న జ్వరంతో బాధపడుతోంది. ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది.



ఇతను వర్ధవెల్లికి చెందిన రాజయ్య. వారం రోజుల క్రితం జ్వరంతో వేములవాడ ఆస్పత్రికొస్తే పరీక్షలు చేసి వైరల్ ఫీవర్ అని అడ్మిట్ చేసుకున్నారు. వారం రోజులుగా ఇక్కడే చికిత్స పొందుతున్నాడు. ఇప్పుడు జ్వరం క్రమంగా తగ్గుతోంది.

జలుబు.. దగ్గు

జిల్లాలో నమోదవుతున్న జ్వరం కేసుల్లో చాలా మందికి జలుబు, విరేచనాలు, దగ్గు, ఒళ్లు నొప్పులు, అలర్జీ, తలనొప్పి లక్షణాలు కనిపిస్తున్నాయి.

ఈఏడాదిలో ఇప్పటి వరకు డెంగీ కేసులు ఎనిమిది నమోదవడం ఆందోళన కలిగిస్తుంది. నెల రోజులుగా వానాకాలంలో జనాలు జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. దోమలు పెరిగి రోగులు అల్లాడిపోతున్నారు. నీరు, ఆహారం కలుషితం కావడంతోనే ఈ సమస్యలు వస్తున్నాయి.

రోజుకు 700 మంది రోగులు

జ్వరాలు, సీజనల్ వ్యాధులతో జిల్లా ఆస్పత్రికి 700 మందికి పైగా ఔట్‌పేషెంట్లు వస్తున్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు పెరగడమే జ్వరాలకు కారణంగా తెలుస్తుంది. ఆస్పత్రిలో ఓపీ సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఓపీ, ఇన్‌పేషంట్ల సంఖ్య సాధారణం కంటే రెండింతలు ఎక్కువగా ఉంటుంది.

వేములవాడలో తగ్గని జ్వరాలు

వేములవాడ ఏరియా ఆస్పత్రి జ్వరపీడితులతో కిటకిటలాడుతుంది. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రికి వస్తున్న వారిలో ఎక్కువ మంది జ్వరాలతో బాధపడుతున్న వారే అధికం. ఏరియా ఆస్పత్రిలో రోజుకు 500 నుంచి 600 వరకు ఓపీలో వైద్యసేవలు పొందుతున్నారు. జ్వరబాధితులతో వేములవాడ ఏరియా ఆస్పత్రిలోని 30 బెడ్లు నిండిపోయాయి.

పారిశుధ్యం అస్తవ్యస్తం

వేములవాడ పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడ చూసిన డ్రెయినేజీలు మురికినీరు రోడ్ల పై నుంచి ప్రవహిస్తుంది. పట్టణంలోని ఏ డ్రెయినేజీపైన కూడా బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదు. కాలనీల్లో దోమలు విపరీతంగా పెరిగినా ఫాగింగ్ చేయడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య పనుల లోపంతోనే విషజ్వరాలు విజృంభిస్తున్నాయని పట్టణ వాసులు అంటున్నారు. వైరల్ ఫీవర్, టైఫాయిడ్, మలేరియా, రక్తకణాలు తగ్గడంతో డెంగీ పరీక్షలు చేస్తున్నారు. మూడు రోజులపాటు జ్వరాలు తగ్గకపోవడంతో ప్రజలు భయానికి ఆస్పత్రిలో అడ్మిట్ అవుతున్నారు.

సిరిసిల్ల ఆస్పత్రిలో జ్వరబాధితులు ఇలా..

జూలై	ఆగస్టు	సెప్టెంబర్	డెంగీ (2023లో)
2034	3471	2034	08

వేములవాడ ఏరియా ఆస్పత్రిలో రోగుల వివరాలు

	జూలై	ఆగస్టు	సెప్టెంబర్
ఓపీ	8,552	10,680	6,970
ఐపీ	795	848	499
పరీక్షలు	8,178	9,211	6,060
డెంగీ	15	38	54
మలేరియా	109	196	227
టైపాయిడ్	109	186	221

రక్తంలో ఇన్‌ఫెక్షన్



మా బాబు పేరు అశ్విన్. ఐదు రోజుల కింద జ్వరం వచ్చింది. తెల్లారే సిరిసిల్లకు వచ్చినం. ఇక్కడ డాక్టర్లు పరీక్షలు చేసి బ్లడ్‌లో ఇన్‌ఫెక్షన్ ఉందన్నారు. జ్వరంతోపాటు జలుబు, దగ్గు ఉంది. జిల్లా ఆస్పత్రిలో మంచిగా చూస్తున్నారు.
– పి.దీన, తంగళ్లపల్లి

పది రోజులుగా జ్వరం



పది రోజుల క్రితం జ్వరంతోపాటు జలుబు, వాంతులు, విరేచనాలు, దగ్గు లక్షణాలు ఉన్నాయి. నిజామాబాద్‌లో ఉండడంతో అక్కడే చూపించుకున్నం. తర్వాత సిరిసిల్లకు వచ్చినం. అయినా జ్వరం తగ్గకపోవడంతో ఆస్పత్రికి వచ్చినం. ఇక్కడ డాక్టర్లు పరీక్ష చేసి కిడ్నీకి ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిపారు.
– దూలం సుశీల

కేసులు పెరిగాయి



పది రోజులుగా జ్వరపీడితుల సంఖ్య పెరుగుతుంది. చాలా మందిలో జ్వరంతోపాటు ఇతర వ్యాధులు కనిపిస్తున్నాయి. ప్లేట్‌లెట్స్ తగ్గుతున్నా మందులతో నయం చేస్తున్నాం. వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారంతోపాటు తాగే నీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లా ఆస్పత్రిలో అన్ని విభాగాల వైద్యులతోపాటు పూర్తిస్థాయిలో మందులు ఉన్నాయి.
– డాక్టర్ మురళీధర్‌రావు, సూపరింటెండెంట్, సిరిసిల్ల

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరాలు వచ్చిన వారు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికొచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవాలి. వైద్యుల సూచనలతో మందులు వాడాలి. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.
– మహేశ్‌రావు, సూపరింటెండెంట్, వేములవాడ

ప్రభుత్వ లక్ష్యాలు పూర్తి చేయండి



సిరిసిల్లఅర్బన్: ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టర్ అనురాగ్‌జయంతి, అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, గౌతమ్‌రెడ్డి హాజరయ్యారు. సీఎస్ మాట్లాడుతూ రైతు రుణమాఫీ, ఎరువుల లభ్యత, జీవో 58, హరితహారం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. గృహలక్ష్మి పథకానికి సంబంధించి ఎంపిక త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, గంగయ్య, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి

- సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల: విద్యార్థులు చదువులతోపాటు ఆటల్లోనూ రాణించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. రాజీవ్‌నగర్ మినీస్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పాఠశాల క్రీడోత్సవాలను జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు నిత్యం కనీసం అరగంటపాటు నచ్చిన ఆటలను ఆడుకోవాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఊరూరా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కేంద్రంలో మినీస్టేడియాన్ని మంత్రి కేటీఆర్ నిర్మించి ఇచ్చారని, జిల్లా విద్యార్థులు ఆటల్లో రాణించాలన్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, జిల్లా యువజన, క్రీడల అధికారి రాందాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, రైతు బంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, సెస్ డైరెక్టర్ దిడ్డి రమాదేవి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి దేవత ప్రభాకర్, స్థానిక కౌన్సిలర్ రాపెల్లి అరుణ పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగుల్లో ఆందోళన

- పదిమందిపై వేటుకు రంగం సిద్ధం
- తప్పులు ఉన్నాయంటున్న రీజినల్ జాయింట్ సెక్రటరీ
- నివేదికపై ఉత్కంఠ



రాష్ట్ర దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ సెక్రటరీ రామకృష్ణకు ప్రసాదాలు అందిస్తున్న ఈవో

వేములవాడ: రాజన్న ఆలయ ఉద్యోగుల్లో భయాందోళన మొదలైంది. గతంలో వచ్చిన ఫిర్యాదులపై దేవాదాయశాఖ రీజినల్ సెక్రటరీ రామకృష్ణ మరోసారి విచారణకు రావడంపై ఆందోళన మొదలైంది. పది మందిపై వేటు పడే అవకాశం ఉందని సంకేతం అందుతుండడంతో వారి గుండెల్లో రైళ్లు ప్రయాణిస్తున్నాయి. బుధవారం ఆలయంలో విచారణ చేపట్టిన రామకృష్ణ రాజన్నను దర్శించుకున్న అనంతరం మాట్లాడారు. ఆలయంలోని గోదాం, లడ్డూల తయారీ, కల్యాణకట్ట, శానిటేషన్ సామగ్రిలో అవకతవకలపై ఫిర్యాదులు రావడంతో ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు అప్పటి ఈవో ఉద్యోగులకు చార్జెస్ ఫ్రేమ్ చేశారని, ఈక్రమంలో మరోసారి విచారణకు వచ్చినట్లు తెలిపారు. పలు విభాగాలను తనిఖీ చేసిన అనంతరం ఏఈవోలు హరికిషన్, జయకుమారి, శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, రాజశేఖర్, హరిహరరావు, శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ పి.శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు తిరుపతి, కె.శ్రీనివాస్‌లపై నివేదిక సమర్పించనున్నట్లు తెలిసింది.

విచారణలో జాప్యంపై సీరియస్

గత కొన్నేళ్లుగా విచారణ పేరుతో జరుగుతున్న జాప్యంపై రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ సీరియస్‌గా వ్యవహరించడంతో రీజినల్ జాయింట్ సెక్రటరీ రామకృష్ణ నేరుగా వచ్చినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

వడ్డేపెల్లి 'కవులు-కావ్యాలు' ఆవిష్కరణ



వడ్డేపెల్లి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన కవి వడ్డేపెల్లి కృష్ణ పరిశోధన గ్రంథం 'కవులు–కావ్యాలు' పరిచయ సభ బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి అతిథులుగా హాజరయ్యారు. క్రీస్తు శకం 946 నుంచి 1975 మధ్యలో జన్మించిన సుమారు 200 మంది తెలంగాణ కవులు వారి కావ్యాల పరిచయ పుస్తకం నవతరం కవులకు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా రూపొందించిన కవి కృష్ణను అభినందించారు. కవులు బూర దేవానందం, డాక్టర్ జనపాల శంకరయ్య, చిటికెన కిరణ్‌కుమార్, గణేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

75 వసంతాల గణేశ్

- స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తితో మొదలు
- కొనసాగుతున్న వినాయక ఉత్సవాలు
- పూర్వీకుల బాటలో.. నేటి తరం



పద్మశాలి సంఘం గణపయ్య (ఫైల్)



వర్తకసంఘం ఆధ్వర్యంలోని వినాయకుడు (ఫైల్)

సిరిసిల్లటౌన్: భావి తరాలు సన్మార్గంలో నడవాలన్న పూర్వీకుల ఆశయాలను కార్మికక్షేత్రంలో కొనసాగిస్తున్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన సంవత్సరంలోనే సిరిసిల్లలో తొలిసారిగా వినాయక చవితి వేడుకలు ప్రారంభమయ్యాయి. స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తితోనే ఏడున్నర దశాబ్దాలకు పైగా వినాయక చవితి సంబురాలు చేసుకోవడం విశేషం. తొలుత వినాయకుడిని పద్మశాలి సామాజిక వర్గానిది కాగా.. రెండోది వైశ్యులకు చెందినదిగా గుర్తింపు. స్వాతంత్య్రం వచ్చిన రోజును పురస్కరించుకుని అప్పటి ప్రముఖులు సంఘాలుగా ఏర్పడి ఏటా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెబుతుంటారు.

పద్మశాలీలదే తొలి గణపతి

సిరిసిల్లలో అత్యధికంగా ఉండే పద్మశాలి సామాజిక వర్గం వారే తొలిసారిగా గణపతి ఉత్సవాలు నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్‌లో రుద్ర శంకరయ్య, మడూరి అంబాజీ, భీమనాథిని నారాయణ, కుడిక్యాల రాజారాం, ఎలగొండ నారాయణ తదితరులు సమాజ సేవా సంఘాన్ని ఏర్పాటు చేసి మొదటి గణపతిని ప్రతిష్ఠించారు. ఈ సంఘంలో ఇతర కులస్తులు కూడా కలిసి వేడుకల్లో పాల్గొనేవారు. తర్వాత పట్టణం చేనేత ఉత్పత్తుల ఖిల్లాగా మారడంతో సహకార సంఘాలతోపాటుగా పద్మశాలి సంఘాన్ని ఏర్పాటు చేసి అందులోనే సమాజ సేవా సంఘాన్ని విలీనం చేశారు. 1947 నుంచి ఇక్కడ ఉత్సవాలను ఏటా క్రమం తప్పకుండా నిర్వహించడం విశేషం. నాటి సమాజ సేవా సంఘం నుంచి ఆవిర్భవించిన పద్మశాలి సంఘం ప్రస్తుతం మార్కండేయ ఆలయం, పద్మశాలి కల్యాణ మండపంతోపాటు ఇతర సామాజిక కార్యక్రమాలను కొనసాగిస్తుంది. అప్పటి పెద్దలు చూపిన భక్తి మార్గాన్ని ఇప్పటితరం ఆచరించడం విశేషం. ప్రస్తుతం స్థానిక మార్కండేయ భవనంలో వినాయక చవితి ఉత్సవాలు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా.. అధ్యక్షుడిగా గోలి వెంకటరమణ కొనసాగుతున్నారు.

భక్తిభావంలో వైశ్యులది ప్రత్యేకం

పట్టణంలో వెలసిన రెండో గణపతిగా సిరిసిల్ల వర్తక సంఘం పెట్టింది పేరు. పద్మశాలీలు నిర్వహించిన తొలి వేడుకలను అనుసరించి వైశ్యులు కూడా 1948లో వర్తకసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు పెద్దలు చెబుతున్నారు. స్థానిక పెద్దబజారు హన్మాన్ ఆలయంలోని రేకులషెడ్డులో ఏర్పాటు చేసిన ఈ సంఘం ఇంతింతై..వటుడింతై.. అన్నట్లుగా అభివృద్ధి సాధించింది. ప్రతీ సంవత్సరం వినాయక నిమజ్జనానికి రెండు రోజులు ముందుగా సిరిసిల్లలో రోషన్లు(భారీ సెట్టింగులు, ప్రత్యేక అలంకారాలు చేయడం) ఆనవాయితి. ఈక్రమంలోనే వర్తకసంఘం ఆధ్వర్యంలో ఆది దేవుడు వినాయకుడికి ఇష్టమైన పిండి పదార్థాలను వందల సంఖ్యలో చేస్తూ నైవేద్యం సమర్పించడం ఈ సంఘం ప్రత్యేకత. తొలితరంలో గాండ్ల వీరయ్య నేతృత్వంలో.. పుల్లూరి బుచ్చారాం, ఎరుకల నర్సయ్య, కొడిమ్యాల తిరుపతి, పుల్లూరి లక్ష్మీనారాయణ, కాచం చిన్నభూమయ్య, చేపూరి విఠల్ తదితరులు కలిసి ఈ సంఘాన్ని స్థాపించి వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈఏడాదితో 75వ వార్షికోత్సవం జరుపుతున్న వర్తకసంఘానికి ప్రస్తుతం పుల్లూరి వేణు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

గర్జించిన అంగన్‌వాడీలు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

సిరిసిల్లటౌన్: హక్కుల సాధనకు అంగన్‌వాడీలు గర్జించారు. ప్రభుత్వం పట్టింపు లేమితనంపై నినదించారు. పదిరోజులుగా నిరవధిక సమ్మెతో దీక్షలు చేపడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ పార్టీల కలిసి మహాధర్నా చేపట్టారు. సిరిసిల్ల కలెక్టరేట్‌ను ముట్టడించగా పోలీసులు అడ్డుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ ముందు బైఠాయించగా.. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సంగీతం శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు సంఘీభావం తెలిపారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోవడానికి యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. సిరిసిల్ల అంగన్‌వాడీ కార్యకర్త విజయ సొమ్మసిల్లి పడిపోగా.. మరో కార్యకర్త మంజులతోపాటుగా పలువురికి స్వల్పగాయాలయ్యాయి. ఏఐటీయూసీ కార్యదర్శి కడారి రాములును పోలీసులు అరెస్టు చేయగా..వాహనాన్ని అడ్డుకుని నిరసనలు తెలిపారు. వారితో మాట్లాడేందుకు డీడబ్ల్యూవో లక్ష్మీరాజం అక్కడికి రాగా.. ఆయనను ఘెరావ్ చేశారు. సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ వచ్చి వారితో మాట్లాడడంతో అంగన్‌వాడీలు శాంతించారు. అంగన్‌వాడీ నాయకులు కల్లూరి చందన, ఎదురుగట్ల మమత, కల్వకుంట్ల పద్మ, శ్యామల, నాగలక్ష్మి, అంజలి, సైదా షఫీ, అయేశ, సుధారాణి, పద్మ, వాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కళాప్రపూర్ణ జాతీయ పురస్కారం అందజేత


అవార్డు అందుకుంటున్న సద్గుణాచారి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని గూడెంకు చెందిన విశ్వబ్రాహ్మణ పురోహితుడు, జ్యోతిష్యుడు రాజూరి సద్గుణాచారి కళాప్రపూర్ణ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఏటా ఒక్కో రంగంలో విశేష కృషిచేసిన వారికి ఈ అవార్డులు అందిస్తుంది. జ్యోతిష్యశాస్త్రంలో ముప్పై ఏళ్లుగా సేవలందిస్తున్న సద్గుణాచారికి ఈ ఏడాది కళాప్రపూర్ణ జాతీయ పురస్కారాన్ని అందజేసింది. హైదరాబాద్ త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో సద్గుణాచారి పురస్కారాన్ని అందుకున్నారు.

23న జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

సిరిసిల్లఅర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న జిల్లాస్థాయి తెలంగాణ స్టేట్ 9వ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. అండర్ 14–20 బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 23న ఉదయం 9 గంటలకు సంబంధిత సర్టిఫికెట్లతో రాజీవ్‌నగర్‌లోని మినీస్టేడియంలో హాజరుకావాలని తెలిపారు.

మహిళకు అరుదైన ఆపరేషన్

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన ఓ మహిళకు దుబ్బాక ప్రభుత్వాస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. తీవ్ర కడుపునొప్పితో మహిళ ఆస్పత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యులు కడుపులో 5.400 కిలోల గడ్డను గుర్తించి ఆపరేషన్ ద్వారా తొలగించారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

గ్రేడ్‌-4 కార్యదర్శులకు ఊరట

సాక్షి ఎఫెక్ట్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నుంచి రెగ్యులర్ గ్రేడ్‌-4 పంచాయతీ కార్యదర్శులుగా మారిన వారికి 'సాక్షి' కథనంతో ఊరట లభించింది. 'ఎస్టీవోలో చేతివాటం?' పేరుతో బుధవారం 'సాక్షి' కథనం ప్రచురించింది. రెగ్యులర్ అయిన జేపీఎస్‌లకు పాన్ నంబర్, బీసీకేపీ అమలుకు ఎస్టీవో అధికారుల పేరు చెప్పి ఎంపీడీవో కార్యాలయాల్లో డబ్బులు వసూల్ చేస్తున్నారని 'సాక్షి' కథనంలో పేర్కొంది. దీంతో జిల్లా ఉన్నతాధికారులు డబ్బుల వసూళ్లపై బుధవారం అధికారులపై సీరియస్ అయినట్లు తెలిసింది. విషయం బయటకు పొక్కడంతో తీసుకున్న డబ్బులను కొత్తగా రెగ్యులర్ అయిన గ్రేడ్‌-4 కార్యదర్శులకు తిరిగిచ్చి, ఎవరికి చెప్పవద్దని కోరినట్లు తెలిసింది. తమ సమస్య పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి'కి జిల్లాలో కొత్తగా రెగ్యులర్ అయిన గ్రేడ్‌-4 కార్యదర్శులు ధన్యవాదాలు తెలిపారు.

మిగిలిన గురుకుల సీట్ల భర్తీకి ఆహ్వానం

సిరిసిల్లఎడ్యుకేషన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో 2023–24 విద్యాసంవత్సరానికి ఎస్సీ బాలబాలికలకు ఐదోతరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి జాక్విలిన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వీటీజీసెట్ 2023, బీఎల్‌వీసెట్ 2023 పరీక్ష రాసి సీటు వచ్చినా రిపోర్టు చేయని వారికి, ఎస్సీ అనాథలు, సెమీ ఆర్ఫన్, ఎస్సీ వికలాంగులు, పరీక్ష రాసిన సీటు రానివారికి అవకాశం ఉంటుందని వివరించారు. విద్యార్థులు సీటు వచ్చిన కాపీ, హాల్ టికెట్స్, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ సర్టిఫికెట్లతో ఈనెల 23న కరీంనగర్ జిల్లా చింతకుంట గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.



భళా.. చిన్నారుల చిత్రకళ

పాఠశాల పరిసరాలను అందంగా తీర్చిదిద్దడంతోపాటు తమలోని నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు. తరగతి గదులు, పాఠశాల ఆవరణలో అందమైన డిజైన్లు వేసి పరిసరాలను ఆహ్లాదంగా తయారు చేస్తున్నారు. రంగు వెలసిన గోడలకు కలర్స్ వేసి.. తమకు వచ్చిన డిజైన్లతో ఆ గోడలను అందంగా మార్చుతున్నారు. విద్యార్థులు వేసిన బొమ్మలను చూసిన పలువురు శభాష్.. అని అభినందిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

అర్హులను ఓటర్లుగా నమోదు చేయండి

- ఆర్డీవో ఎన్.ఆనంద్‌కుమార్


అఖిలపక్షం నేతలతో సమావేశమైన ఆర్డీవో ఆనంద్‌కుమార్

సిరిసిల్ల: అర్హులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలని సిరిసిల్ల ఆర్డీవో ఎన్.ఆనంద్‌కుమార్ కోరారు. సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ ఆఫీస్‌లో బుధవారం సాయంత్రం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ బూత్ లెవల్ ఆఫీసర్లను సంప్రదించి కొత్త ఓటర్లను నమోదు చేయించాలన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఇప్పటి వరకు వచ్చిన ఓటర్ల దరఖాస్తుల వివరాలపై చర్చించారు. సిరిసిల్ల తహసీల్దార్ ఎండీ షరీఫ్ మొహియొద్దీన్, వివిధ పార్టీల నాయకులు గజభీంకార్ రాజన్న, జక్కుల యాదగిరి, కళ్యాణ్‌చక్రవర్తి, ఎస్.ప్రశాంత్, పి.కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ


బీజేపీలో చేరిన నాగంపేట గ్రామస్తులు

గంభీరావుపేట(సిరిసిల్ల): రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని నాగంపేటలో బుధవారం పలువురు గ్రామస్తులు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెడుతున్న పథకాలకు, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజాఆదరణ పెరుగుతుందన్నారు. దేశ, రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లగిశెట్టి శ్రీనివాస్, జిల్లా నాయకులు ఆడెపు రవీందర్, మల్లికార్జున్, రాజిరెడ్డి, లక్ష్మీయాదవ్, మహేశ్, వాజిద్, మేకర్తి శ్రీనివాస్, మండలాధ్యక్షుడు గంట అశోక్, మహేశ్‌యాదవ్, మురళీమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

- ఎల్లారెడ్డిపేటలో సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న సాధన కమిటీ సభ్యులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ బుధవారం సంతకాల సేకరణ చేపట్టింది. ఎల్లారెడ్డిపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని చేపట్టిన సంతకాల సేకరణకు వస్త్ర, వ్యాపార, వాణిజ్య సముదాయాల నిర్వాహకులు సంతకాలు చేశారు. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాలతో రెవెన్యూ డివిజన్‌ను ప్రకటించాలని సాధన కమిటీ కన్వీనర్ ఒగ్గు బాలరాజు కోరారు. నాలుగు మండలాల్లో గ్రామగ్రామాన సంతకాలు సేకరిస్తామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు సంతకాలు పంపిస్తామన్నారు. అన్నివర్గాల ప్రజలు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని స్వచ్ఛందంగా సంతకాలు చేస్తున్నారని బాలరాజు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్దెల్లి స్వామి, రఫీక్, బాబు, సూర్య, అంజయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్‌మానేరులో 22 టీఎంసీలు



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో ప్రస్తుతం 22 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాలుగు రోజుల క్రితం ఎస్సారెస్పీ నీరు విడుదల చేశారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

సిరిసిల్లక్రైం: చిన్నపిల్లల సహాయంతో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను, ఒక బాలుడిని సిరిసిల్ల టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం తెలిపారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం బర్ధమాన్ జిల్లా జమున మండలం ఆజాద్‌నగర్‌కు చెందిన రాజకుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ జిల్లా బుక్కరాయసముద్రం మండలం గిరిప్రసాదనగర్‌కు చెందిన పాముల శివయ్య సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.2లక్షల విలువైన నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై సిరిసిల్ల టౌన్‌లో 5 కేసులు, వేములవాడ టౌన్, తంగళ్లపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఒక్కో కేసు నమోదైనట్లు వివరించారు. పండుగ రోజుల్లో జనాలు ఎక్కువగా గుమిగూడె ప్రదేశాలు, మార్కెట్ ఏరియాలలో చిన్నపిల్లల సహాయంతో సెల్‌ఫోన్ల చోరీకి యత్నిస్తున్నట్లు తెలిపారు. రద్దీ ఉండే ప్రదేశాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం కిష్టంపేట, జోగాపూర్ గ్రామాలకు చెందిన రైతుల విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. కిష్టంపేటకు చెందిన గసికంటి రాములు, తాళ్లపెల్లి గంగారాంలకు చెందిన రెండు మోటార్లను ఎత్తుకెళ్లినట్లు వివరించారు.

టేకు కలప పట్టివేత

చందుర్తి(వేములవాడ): కొత్తపేట అటవీ ప్రాంతంలో అక్రమంగా నిలువ ఉంచిన టేకు కలపను అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి రాఘవేంద్రరావు, బీట్ ఆఫీసర్ బాలకృష్ణ బుధవారం పట్టుకున్నారు. అటవీ ప్రాంతంలో టేకుదుంగలను నిలువ ఉంచారన్న సమాచారంతో దాడి చేయగా రూ.80వేల విలువైన రెండు ట్రాక్టర్ల కలప లభించినట్లు తెలిపారు. కలపను కల్లెడ డిపోకు తరలిస్తున్నట్లు చెప్పారు.

మంత్రపురిలో 'భక్తి' ఉద్యమం

- మహారాష్ట్ర నుంచి మంథనికి..
- బాలగంగాధర్‌తిలక్ స్ఫూర్తి
- 106ఏళ్లుగా వినాయక ఉత్సవాలు
- నిజాం కాలం నుంచి కొనసాగింపు


1913లో తొలిసారి ఉత్సవాలు నిర్వహించిన పెంజేరుకట్ట ఉత్సవ కమిటీ(ఫైల్)

మంథని: మంత్రపురిగా పేరొందిన మంథనిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ 110 ఏళ్లుగా ఏటా వేడుకలు నిర్వహిస్తూ రాష్ట్రంలోనే గుర్తింపు చాటుకున్నారు. ఉత్సవాలు అంటే.. అందమైన సెట్టింగ్‌లు, అన్నదానాలు, పెద్ద ఎత్తున నిమజ్జనం ఊరేగింపులు.. ఇలాంటివి చూస్తాం. కానీ, మనదేశ స్వాతంత్య్ర ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి గణపతి నవరాత్రి ఉత్సవాలు దోహదం చేశాయనే విషయం చాలా మందికి తెలియదు. ఆ వివరాలే ఇవీ..

బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తితో..

- బాలగంగాధరతిలక్ మహారాష్ట్రలోని ముంబయిలో వినాయక నవరాత్రి ఉత్సవాల పేరిట 1913లో నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు.
- ఆ ఉత్సవాల సందర్భంగా వంటలు తయారు చేసేందుకు మంథనికి చెందిన బ్రాహ్మణ సామాజికవర్గం మధ్యభారత్‌లోని నాగ్‌పూర్(ప్రస్తుత మహారాష్ట్ర)కు వెళ్లి వచ్చేవారు.
- అంతేకాదు.. అక్కడి సంప్రదాయం తీసుకొచ్చారు. ఇక్కడ కూడా అదేవిధంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు.
- దైవభక్తి పేరిట మంటపాల వద్ద ప్రజలు కలసుకుని బ్రిటిష్‌తోపాటు నిజాం నిరంకుశ పాలనలకు వ్యతిరేకంగా ఐక్యఉద్యమాలకు వ్యూహరచన చేశారు.
- నాటి స్వాతంత్య్ర సమరానికి చిహ్నంగా నిలిచిన గణపతి నవరాత్రి ఉత్సవాలను సర్వ గణానన మండలి ఆధ్వర్యంలో ఒకే చోట నిర్వహించారు.

నిజాం కాలం నుంచి..

నిజాంకాలం నాటి వినాయక నవరాత్రి ఉత్సవాల సంస్కృతి, సంప్రదాయాలు కాలక్రమంలో అన్ని గ్రామాలకూ విస్తరించాయి. ఈ నేపథ్యంలోనే మంథని పెంజేరుకట్ట హనుమాన్ ఆలయంలో సిద్ధిబుద్ధి గణపతి ఉత్సవాలను 1913 నుంచి ఏటా నిర్వహిస్తున్నారు.

- మోతారాంగారి రాజేశ్వర్‌రావు, టక్కేగారి మల్లన్న, మంథని లింగయ్య తదితరులు ఆనాడు ఉత్సవాలు నిర్వహించేవారు.
- అలాగే నడివీధిలో సర్వజన గణానన మండలి పేరిట 1918 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.
- ఐదేళ్ల క్రితం శతవసంత ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు.
- రావులచెరువు కట్ట గజానన మండలి 99 సంవత్సరాలు పూర్తిచేసుకుంది. వచ్చే ఏడాది శతవసంతాల్లో అడుగుపెట్టనుంది.
- మందాటవీధిలో అరవై ఏళ్లుగా ఏటా గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్నారు.

నాగ్‌పూర్, మంథనిలోనే సిద్ధిబుద్ధి

నాగ్‌పూర్, మంథని మినహా దేశంలో ఎక్కడా సిద్ధిబుద్ధి(భార్యలు) విగ్రహాలతో గణేశ్ దర్శనం లభించదు. వంటలకు వెళ్లిన వారు నాగ్‌పూర్‌లో గణపతి విగ్రహాన్ని తీసుకుని రైలులో బల్లార్షా వరకు వచ్చి.. అక్కడ విగ్రహం కనిపించకుండా గుడ్డలు చుట్టి, ఎడ్లబండిలో మంథని సమీప గోదావరి తీరం వరకు చేరుకున్నారు. అక్కడి నుంచి కాలిబాటన నిజాం పోలీసుల కంట పడకుండా మంథనికి చేరారని చెబుతున్నారు.

105 ఏళ్లుగా ఏటా ఉత్సవాలు



మంథని నడివీధి సర్వజన గణానన మండలి వినాయక నవరాత్రి ఉత్సవాలను 105 ఏళ్లుగా ఏటా నిర్వహిస్తోంది. వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఐదేళ్ల క్రితం ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నాం. నిత్యం భజనలు చేస్తున్నాం. భక్తిశ్రద్ధలతో గణపతిని పూజిస్తున్నాం.

– శశిభూషణ్ కాచే, స్థానికుడు, మంథని

శత వసంతోత్సవాలకు సన్నద్ధం



హిందువుల ఐక్యత, నిజాం నవాబులకు వ్యతిరేకంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను వేదికగా చేసుకున్నారు. అప్పటి నుంచి రావులచెరువు కట్ట అభయాంజనేయస్వామి ఆలయంలో 99ఏళ్లుగా ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది వందేళ్లు పూర్తవుతాయి. ఆ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– బొబ్బిలి శ్రీధర్, ఉత్సవ సమితి అధ్యక్షుడు, రావుల చెరువుకట్ట

పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్


అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కోనరావుపేట(వేములవాడ): పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠాను రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట పోలీసులు అరెస్టు చేశారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వివరాలు వెల్లడించారు. మండలం ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల రాజలింగం వద్ద ఈనెల 6వ తేదీన 80 నాటుబాంబులు లభించాయి. రాజలింగంను అదుపులోకి తీసుకుని విచారించగా.. తానే నాటుబాంబులను తయారు చేస్తానని, కావాల్సిన ముడిసరుకును కామారెడ్డికి చెందిన గుర్తుతెలియని మహిళ సరఫరా చేస్తుందని తెలిపారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్సై ఆంజనేయులు, కానిస్టేబుళ్లు దండి నరేశ్, నవీన్, తిరుపతి, బాలనర్సయ్య బృందంగా ఏర్పడి విచారణ చేపట్టారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డికి చెందిన మానెపల్లి చంద్రకళ(65) వద్ద 3 కిలోల పేలుడు పదార్థాల ముడిసరుకు లభించింది. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు వచ్చి సరుకులు అందిస్తారని ఆమె అంగీకరించింది. ఈనెల 19న ఎప్పటిలాగానే ముడిసరుకును అందజేయడానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన జగదీశ్ బహాటిని అదుపులోకి తీసుకొని విచారించగా రెండు కిలోల ముడిసరుకు దొరికింది. అతను సరుకును తీసుకొచ్చే బేగంబజార్‌లోని దుకాణంపై దాడి చేసి నారాయణదాస్ సార్దను, అతని అనుచరుడు విఠల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 కిలోల పేలుడు పదార్థాల ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని వివరించారు.

గుడిసెలు వేసేందుకు యత్నం..

- అడ్డుకున్న పోలీసులు


సీపీఎం నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

సిరిసిల్లఅర్బన్: పెద్దూరులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం సమీపంలోని ప్రభుత్వ స్థలంలో బుధవారం గుడిసెలు వేసేందుకు యత్నించిన నిరుపేదలను పోలీసులు అడ్డుకున్నారు. సీపీఎం నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున్న ఎర్ర జెండాలతో తరలివచ్చారు. సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రభుత్వ భూముల్లోకి వెళ్లేందుకు యత్నించిన నాయకులను, మహిళలను పోలీసులు అడ్డుకున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఎంపికై డ్రాలో పేరు రాని నిరుపేదలకు ప్రభుత్వం ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి పదేళ్లు గడిచినా ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. పెద్దూరులో సమీపంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్‌లో గుడిసెలు వేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, నాయకులు ఎలిగేటి రాజశేఖర్, నక్క దేవదాస్, గోవింద్ లక్ష్మణ్, కంది మల్లేశం, స్వప్న, లావణ్య, సురేశ్, తిరుపతి ఉన్నారు.

చిరుతదాడిలో మేక మృతి


మల్లన్నగుట్ట శివారులో మృతి చెందిన మేక

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం కిష్టంపేట శివారులోని మల్లన్నగుట్ట ప్రాంతంలో మేకపై చిరుతపులి దాడిచేసింది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు. కిష్టంపేటకు చెందిన మేకల కాపరి నాగుల దేవయ్య మేకల మందను మల్లన్న గుట్ట ప్రాంతానికి తీసుకెళ్లాడు. మంగళవారం సాయంత్రం మందను కొట్టుకుని ఇంటికి రాగా.. ఓ మేక తప్పిపోయినట్లు గుర్తించాడు. బుధవారం మల్లన్న గుట్ట ప్రాంతం వైపు వెళ్లి చూడగా అది చనిపోయి కనిపించింది. మేకపై చిరుతపులి దాడి చేసి ఉంటుందని భావిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మల్లన్నగుట్ట ప్రాంతాన్ని ఆనుకున్ని ఉన్న సనుగుల, రామారావుపల్లె, కిష్టంపేట, బండపల్లి గ్రామాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. చిరుతపులి దాడి విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలిపేందుకు గ్రామ సర్పంచ్ ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదని తెలిపారు.

టీఎన్‌జీవో రాష్ట్ర నాయకులకు సన్మానం



సిరిసిల్ల: తెలంగాణ నాన్‌గెజిటెట్ ఉద్యోగుల సంఘం(టీఎన్‌జీవో) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, మారం జగదీశ్వర్‌లను జిల్లా టీఎన్‌జీవో ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారిని సత్కరించి, వేములవాడ రాజరాజేశ్వరస్వామి ప్రసాదాన్ని అందించారు. రెండోసారి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ఎలుసాని ప్రవీణ్‌కుమార్, గాజుల సుదర్శన్‌లకు రాష్ట్ర నాయకులు అభినందనలు తెలిపారు. టీఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, ఆకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే పోలీసులు

- వేములవాడరూరల్ సీఐ కృష్ణకుమార్


మాట్లాడుతున్న సీఐ కృష్ణకుమార్

వేములవాడరూరల్: ప్రజల కోసమే పోలీస్‌శాఖ పనిచేస్తుందని ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ కోరారు. మండలంలోని ఎదురుగట్లలో బుధవారం రాత్రి మీ కోసమే పోలీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణకుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత గొడవలకు దిగి జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. ఏదైని సమస్య ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కలవాలన్నారు. ఎస్సై మారుతి, సర్పంచ్ సోయినేని కరుణాకర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గొస్కుల రవి తదితరులు ఉన్నారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు గొల్లపల్లి విద్యార్థినులు


క్రీడాకారులను అభినందిస్తున్న నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించే జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు మండలంలోని రాచర్లగొల్లపల్లి విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్ర జట్టు తరఫున గొల్లపల్లి జెడ్పీ స్కూల్ విద్యార్థులను జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు బుధవారం అభినందించారు. రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన ముద్రకోల అఖిల, సభ్యులుగా ఎంపికైన రమ్య, సహన, భార్గవి, మనీశ, రూపిక, రుచిత, దివ్య, కోచ్ అనిల్‌ను అభినందించారు. విద్యార్థులకు రూ.10వేలు జెడ్పీటీసీ అందించారు. గొల్లపల్లి లయన్స్ క్లబ్ బాధ్యుడు వంగల శ్రీనివాస్ ట్రాక్‌సూట్స్ అందజేశారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు రమేశ్, బండారి బాల్‌రెడ్డి, మీసం రాజం, రవీందర్, మల్లేశ్, దేవయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

హరితహారంలో వెదురు నాటాలి

- మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు కోన బాలశేఖర్
- సిరిసిల్లలో ఘనంగా వెదురు దినోత్సవం


వెదురు వస్తువులు అల్లుతూ మేదరుల ప్రదర్శన

సిరిసిల్లటౌన్: హరితహారంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వెదురు మొక్కలను నాటాలని జిల్లా అధ్యక్షుడు కోన బాలశేఖర్ కోరారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మేదరులు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ర్యాలీ తీశారు. బాలశేఖర్ మాట్లాడుతూ అడవిలో పెరుగుతున్న వెదురుపై మేదరులకు హక్కులు కల్పించాలని కోరారు. ప్లాస్టిక్ వస్తువులను నిషేధిస్తే పర్యావరణాన్ని కాపాడడంతోపాటు మేదరులకు ఉపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. బీసీబంధు ద్వారా రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోన శ్రీనివాస్, కనికరపు రాజన్న, రాంసాగర్, అంజయ్య, కనికరం అనిల్, కనకయ్య, రామస్వామి, మల్లేశం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.